సాక్షి తిరుపతి

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



న్యూస్‌రీల్

వేదిక్ వర్సిటీకి ఐకేఎస్ గుర్తింపు

తిరుపతి సిటీ : కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖకు చెందిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) అఖిల భారత స్థాయిలో 8 ఉన్నత విద్యాసంస్థలకు గుర్తింపు నిచ్చింది. అందులో భాగంగా టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీకి ఐకేఎస్ గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు వేద, వేదాంగ, వేదాంతం విభాగాల్లో పరిశోధనలకు ఆర్థిక సహాయంతో కూడిన ప్రత్యేక కేంద్రం కేటాయిస్తున్నట్లు పేర్కొంది. భవిష్యత్‌తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తింపు తెచ్చుకునేందుకు వర్సిటీకి ఇది తొలి సోపానం కానుంది. గుర్తింపునకు సహకరించిన ఫ్యాకల్టీ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ వెంకట రాధేశ్యామ్, డాక్టర్ ఎంవీఎన్ పవన్ కుమార్‌శర్మను వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

టీటీడీకి టాటా ఏస్ వాహనం



వాహన తాళం అందిస్తున్న దాతలు


తిరుమల: తిరుపతికి చెందిన టాటా మోటార్స్ వరలక్ష్మీ ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీకి రూ.5.06 లక్షలు విలువైన టాటా ఏస్ ప్రో వాహనాన్ని విరాళంగా అందించింది. సోమవారం ఈ మేరకు సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ఎదురుగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పేష్కార్ రామకృష్ణకు తాళాలు అందించారు.

'బంగారు జడ'.. బరువాయె!

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో జ్ఞాన ప్రసూనాంబ అలంకరణకు స్వర్ణ జడను వినియోగించకపోవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమ్మవారికి కర్ణాటక మాజీ ఎంపీ గాలి జనార్ధన్‌రెడ్డి వితరణగా బంగారు చీర, కంఠాభరణాలు, తొడుగులతోపాటు స్వర్ణ జడను అందించారు. అప్పటి నుంచి బ్రహ్మోత్సవాలు, ఇతర పండుగ రోజుల్లో అమ్మవారికి బంగారుజడను అలంకరించేవారు. అయితే జడకు ఒక లింకు ఊడిపోవడంతో పక్కనపెట్టేశారు. సాధారణంగా సమస్యను దాత దృష్టికి తీసుకెళ్లాలి. లేకుంటే ఆలయం తరఫునే మరమ్మతులు చేయించాలి. అయితే ఆలయ అధికారులు మాత్రం ఈ విషయంలో కనీసం స్పందించలేదు. శ్రావణమాసంలో సైతం బంగారు జడను అమ్మవారికి అలంకరించలేదు. దీంతో అధికారుల అలసత్వంపై భక్తులు మండిపడుతున్నారు. దసరా నవరాత్రుల నాటికైనా స్వర్ణ జడకు మరమ్మతులు చేయించి అమ్మవారికి అలంకరించాలని కోరుతున్నారు.

పేదల దేవుడు నువ్వు
అభాగ్యుల ఆరాధ్యదైవం నువ్వు
జల ప్రదాతవి నువ్వు
ఆరోగ్య రక్షకుడివి నువ్వు
చదువుల రేడువి నువ్వు
సంక్షేమ సారథివి నువ్వు
నవ సంకల్పానికి నాందివి నువ్వు
జవసత్వానికి పునాదివి నువ్వు
మమ్మేలిన 'మహా నేతవి' నువ్వు

16 ఏళ్ల నీ జ్ఞాపకాలు.. అభివృద్ధికి చెరగని సంతకాలు నిన్ను ఎలా మరిచేది రాజన్నా.. అంటూ జిల్లా ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను స్మరించుకుంటున్నారు.



రాజన్నలేక బోసిపోయిన చిత్తూరు అనుప్పల్లె

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించిన రైతుబాంధవుడు

- ఫీజురీయింబర్స్‌మెంట్‌కు శ్రీకారం చుట్టిన మహనీయుడు
- ఆరోగ్యశ్రీతో పేదలకు రక్షణ కల్పించిన ఆపద్బాంధవుడు
- జలయజ్ఞం చేపట్టిన దార్శనికుడు
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

పదహారేళ్లు.. చెరగని జ్ఞాపకాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : మనసున్నవాడు పాలన సాగిస్తే ఎంత జనరంజకంగా ఉంటుందో.. ప్రజలను ఓటర్లుగా కాకుండా తన వాళ్లుగా చూసే నాయకుడు గద్దెనెక్కితే రాష్ట్రం ఎంత సుభిక్షంగా ఉంటుందో దేశానికి చాటి చెప్పిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. తెలుగువారి గుండెల్లో సంక్షేమ సంతకం చేసి చెరగని జ్ఞాపకంగా మిగిలిపోయారు. నేడు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఆయన చేసిన అభివృద్ధి పనులపై ప్రత్యేక కథనం.

- నాటి ఉమ్మడి జిల్లాలోని మదనపల్లెలో మూతపడిన విజయాడెయిరీని 2008లో పునఃప్రారంభించారు. 5వేల లీటర్లతో ప్రారంభమైన డెయిరీని 70వేల లీటర్ల స్థాయికి పెంచారు. వ
- తిరుపతిలో ప్రధాన కూడళ్లను ఏర్పాటు చేసి మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీకృష్ణదేవరాయలు, శంకరంబాడి, ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహాల స్థాపనకు శ్రీకారం చుట్టారు.తిరుపతి ముఖద్వారంలో పూర్ణకుంభం ఏర్పాటు చేశారు. అలాగే తెలుగుతల్లి విగ్రహం నెలకొల్పారు.
- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ సైతం ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అందులో దేశ, విదేశాలకు చెందిన 2వేల మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారు,
- జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టారు.

- సత్యవేడులో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, 9 ఉన్నత పాఠశాలలు, ఒక తమిళ మీడియం స్కూలు ఏర్పాటు చేశారు. ఉబ్బలమడుగు, భూపతేశ్వరకోన, రాళ్లవాగు నీటి ప్రాజెక్టులను చేపట్టారు. రూ.5.50 కోట్లతో భూపతేశ్వరకోన ప్రాజెక్టు, రూ.19 కోట్లతో ఉబ్బలమడుగు ప్రాజెక్టు నిర్మించారు. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి చెరువులకు నీటిని నింపేందుకు రూ.100 కోట్లతో ఉపకాలువలు నిర్మించారు.

- తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైఎస్సార్ మానసపుత్రికగా నిలిచిపోయింది. 2004 సెప్టెంబర్ 30న వర్సిటీ ఏర్పాటుకు బీజం పడింది. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తిరుపతి వెటర్నరీ కళాశాల స్వర్ణోత్సవాలకు ముఖ్యతిథిగా హాజరయ్యారు. కళాశాలను యూనివర్సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. 2005 జూలై 15న వర్సిటీ గుర్తింపునిచ్చారు. రూ.145 కోట్లు కేటాయించి అభివృద్ధికి బాటలు వేశారు. ప్రస్తుతం ఈ వర్సిటీ పరిధిలో 35 కళాశాలు ఉన్నాయి. 3వేల పైగా విద్యార్థులు చదువుతున్నారు. 305 మంది అధ్యాపకులు, 2,545 మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

అందులో భాగంగా 2006లో శ్రీసిటీ సెజ్‌కు అనుమతులు మంజూరు చేశారు. 2008లో 8 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వందలాది పరిశ్రమలతో శ్రీసిటీ రాష్ట్రానికే తలమానికంగా నిలిచింది. సుమారు రూ.60వేలకు పైగా పెట్టుబడులతో 27 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పడ్డాయి.

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మిగులు జలాలను తరలించి సాగు, తాగునీరు అందించేందుకు 2005లో గాలేరు-నగరి సుజల ప్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారు. దాదాపు 70శాతం పనులు పూర్తి చేశారు.
- నగరి నియోజకవర్గంలో చేనేతల సంక్షేమానికి చర్యలు చేపట్టారు. రసాయన నీటిని శుభ్రపరిచే కామన్ ఈటీపీ ప్లాంటు ఏర్పాటుకు అనుమతులతోపాటు రూ. 14 కోట్లు మంజూరు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రోజా ప్లాంటును ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు.
- నగరిలో రూ.15 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి మంజూరు చేశారు. ఆయన మరణానంతరం పాలకులు ఆ ఆస్పత్రిని 60 పడకలకే పరిమితం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద రూ.5కోట్లతో అభివృద్ధి చేశారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ వారు అదనపు పడకలు, వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని వితరణగా అందించారు.
- నగరి మున్సిపల్ పరిధి సత్రవాడ శివారులో రూ.36 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. తదనంతర కాలంలో గాలేరు నగరి ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం ఆ ట్యాంక్ ద్వారానే నగరి ప్రజల దాహార్తి తీరుతోంది.

- సోమశిల-స్వర్ణముఖి కాలువకు 2009లో శ్రీకారం చుట్టారు. వెంకటగిరి నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చారు. మరో 10 వేల ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకువచ్చారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో 30 వేల ఎకరాల సాగు నీరు అందించేలా ప్రాజెక్టుకు లక్ష్యాలను నిర్దేశించారు.

- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రారంభించారు. 2004 నుంచి 2008 వరకు ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులకు ఫీజులు రీయింబర్స్ చేశారు.
- వ్యవసాయం దండగని చంద్రబాబు అంటే.. కాదు వ్యవసాయం పండగని వైఎస్సార్ నిరూపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 6.40 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు. ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాతలకు సంబంధించి వారి కుటుంబాలకు తక్షణం ఆర్థిక సాయం చేశారు.

- కుప్పం నియోజకవర్గంలో సైతం వైఎస్సార్ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పేదల సంక్షేమానికి కృషి చేశారు. అందులో భాగంగా రూ.69.03 కోట్ల విద్యుత్ బకాయిల మాఫీతో పాటు 23,144 మంది రైతులకు చెందిన రూ.60.24 కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు. మరో 5వేల మందికి రూ.5వేల వంతున ప్రోత్సాహకాలను అందజేశారు. పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి రూ.55 కోట్లు నిధులు కేటాయించారు. కుప్పం నియోజకవర్గంలో 36 వేల పైగా ఇళ్లను పేదలకు మంజూరు చేశారు. 26 వేల రేషన్, ఆర్యోగశ్రీ కార్డులు అందజేశారు. ద్రవిడ యూనివర్సిటీకి నిధుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. 14 కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. కుప్పంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అబకలదొడ్డి వద్ద ఐటీఐ ఏర్పాటు చేశారు. శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, కుప్పంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలను ప్రారంభించారు. నియోజకవర్గంలో 5 భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారు.

- చంద్రబాబు హయాంలో మూతపడిన చెరుకు ఫ్యాక్టరీలకు రూ.50 కోట్లు కేటాయించి పునఃప్రారంభించారు.
- ఉమ్మడి జిల్లాలో 3.15 లక్షల మందికి గూడు కల్పించారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీ ఏర్పాటు చేసి 11వేల మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారు.

రాజన్నా.. రచ్చబండే సాక్షి

చిత్తూరు అర్బన్: 'రచ్చబండ సాక్షిగా నిను మరువలేం రాజన్నా.. అంటూ అనుప్పల్లె గ్రామస్తులతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు నేటికీ కన్నీళ్లు పెడుతూనే ఉన్నారు. నీ జ్ఞాపకాలు తలుచుకుని.. తీపి గురుతులు నెమరువు వేసుకుని ఆవేదనకు లోనవుతూనే ఉన్నారు. 2009, సెప్టెంబరు 2న సీఎం స్థాయి వ్యక్తి నేరుగా ప్రజలను కలిసి, వ్యక్తిగత-మౌలిక అవసరాలు గుర్తించి తెలుసుకుని.. వాటి పరిష్కరించే వినూత్న కార్యక్రమానికి నడుంబిగించారు. చిత్తూరులో చేపట్టిన ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే .. రాష్ట్ర మొత్తం అమలు చేయాలని రాజశేఖర రెడ్డి ఆలోచన. ముఖ్యమంత్రి హోదాలో రచ్చబండకు వస్తున్న వైఎస్.రాజశేఖర రెడ్డికి స్వాగతం పలికేందుకు కట్టమంచిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ అందరూ నిరీక్షిస్తున్నారు. సమయం ఉదయం 9.30 గంటలైనా చాపర్ చేరుకోలేదు. పదయినా ఆచూకీ రాలేదు. సమయం దాటుతున్న కొద్దీ సామాన్యుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఆందోళన మొదలైంది. రాజన్న అచూకీ లేదనే విషయం ఆలస్యంగా గుర్తించారు. ప్రత్యేకించి ఆ రోజు అనుప్పల్లె గ్రామమంతా వైఎస్సార్ గురించి ఏదైనా తెలుస్తుందేమోనని టీవీలకు అతుక్కుపోయారు. తీరా మరుసటి రోజున చాపర్ పావురాలగుట్ట వద్ద ప్రమాదానికి గురై రాజన్న కన్నుమూశారన్న విషాద వార్తను వినాల్సి వచ్చింది. రాజన్న కూర్చుంటారని ఆశించి భంగపడ్డ రచ్చబండ మూగబోయింది. ఊరు ఊరంతా ఆ మహనీయుడి కోసం కన్నీళ్లు పెట్టుకుంది. అనుప్పల్లె రావిచెట్టు కిందున్న రచ్చబండ వైఎస్సార్‌ను స్పర్శించలేకపోయానని మథనపడుతూనే ఉంది. రాజన్న వర్ధంతికి ఒకరోజు ముందుగానే గ్రామస్తులు రచ్చబండ వద్దకు చేరుకుని కుమిలిపోవడం కనిపించింది.



రాజన్న చివరి రాకకోసం చిత్తూరు అనుప్పల్లెలో ఏర్పాటు చేసిన రచ్చబండ (ఫైల్)

పరిష్కారం.. ప్రహసనం!

అవు చేనులో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా..? అన్నట్లు తయారైంది అధికారుల వ్యవహారశైలి. పేదల ఊసే గిట్టని పాలకుల బాటనే.. జిల్లా యంత్రాంగం నడుస్తోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఓ ప్రహసనంగా మార్చేసింది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో తూతూమంత్రంగా వినతుల స్వీకరణ తంతు చేపడుతోంది. వెంటనే కష్టం తీర్చేస్తున్నామని కలరింగ్ ఇచ్చేందుకు అర్జీదారు ఫోన్‌కు మెసేజ్ పంపేసి చేతులుదులిపేసుకుంటోంది. ఇక అంతే వాటికి అతీగతీ ఉండదు. సమస్య తీరదు. మళ్లీ సోమవారం వస్తే అంతా మామూలే. వినతులు వస్తుంటాయ్.. ఆన్‌లైన్‌లోకి ఎక్కుతుంటాయ్.. పరిష్కారానికి మాత్రం నోచుకోవు.. కార్యాలయాల చుట్టూ ప్రజలకు ప్రదక్షిణలు మాత్రం తప్పవు.



కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులు

- సమస్యల సుడిగుండంలో ప్రజలు
- కలెక్టరేట్ చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- గ్రీవెన్స్‌కు వెల్లువెత్తుతున్న వినతులు
- అధికారుల అలసత్వంతో అతీగతీ లేని అర్జీలు
- ఆవేదన.. ఆందోళనలో బాధితులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో చిన్నపాటి సమస్యల పరిష్కారానికి కూడా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సచివాలయ నుంచి తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాలతోపాటు కలెక్టరేట్ చుట్టూ పలు మార్లు తిరగాల్సిన దుస్థితి దాపురించింది. ప్రతి చోటా అర్జీలు మాత్రం తీసుకుంటారు.. ఇక స్పందన ఉండదు. మళ్లీ వెళితే ఏదో కారణం చెప్పి మరో కార్యాలయానికి వెళ్లమంటారు. ఈ క్రమంలో చివరకు కలెక్టరేట్‌కు వెళ్లినా ఫలితం శూన్యంగా కనిపిస్తోందని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అంటూ ఉన్నతాధికారులందరూ కొలువుదీరుతారు. సమస్యలు తీరకపోతాయా అనే ఆశతో అర్జీదారులు సైతం పెద్దసంఖ్యలో బారులు తీరుతారు. కనీస వసతులు కూడా కల్పించని పరిస్థితుల్లో ఆకలి, దప్పులతో అలమటిస్తూ గంటల తరబడి నిరీక్షిస్తారు. ఎట్టకేలకు తొక్కుకుంటూ.. తోసుకుంటూ అధికారుల ముందు నిలబడతారు. వారు వింటారో లేదో.. తెలియని వాతావరణంలో తమ గోడు వెళ్లబోసుకుంటారు. కష్టం తీరుస్తారేమో అనే ఆశతో వినతులు సమర్పిస్తారు. అయితే ప్రజలకు పడిగాపులే చివరకు మిగులుతున్నాయి. ఆశలు నిరాశగానే మారుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రభుత్వం పట్టించుకోదు. ఇదే అదునుగా అధికారులు సైతం నిర్లక్ష్యం వహించి గ్రీవెన్స్ లక్ష్యాలను నీరుగార్చేస్తున్నారు. ప్రజలు మాత్రం చేతిలో అర్జీలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

సచివాలయం నుంచి కలెక్టరేట్‌కు..



మాకు రెండు ఎకరాల భూమి ఉంది. మా ఊర్లోని కొందరు మా భూమిని వారి పేర్ల మీద ఆన్‌లైన్‌లో నమోదు చేయించేసుకున్నారు. దీంతో దిక్కుతోచక సచివాలయంలో ఫిర్యాదు చేశా. కొద్దిరోజులు తిప్పుకుని నెల తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లమన్నారు. అక్కడి సిబ్బంది ఆర్‌డీఓ ఆఫీస్‌కు వెళ్లమని సూచించారు. నాలుగు నెలలు ఈ విధంగా తిరిగి, చివరకు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ పెట్టుకున్నా. ఇక్కడ 75 రోజుల గడువు ఇచ్చారు. పరిష్కారం ఏం చూపుతారో తెలియడం లేదు. మాకు ఆ భూమే ఆధారం. కార్యాలయాల చుట్టూ తిరిగేందుకు ఖర్చులు పెట్టుకునే స్తోమత కూడా మాకు లేదు.

– టి.సుబ్బమ్మ, ముచ్చివోలు, శ్రీకాళహస్తి మండలం

ఎన్నిసార్లు తిరగాలో..



నాకు 70 ఏళ్ల. సరిగా నడవలేను. గుండెకు ఆపరేషన్ కూడా అయ్యింది. నాకు వంశపారంపర్యంగా విక్రుతమాలలోని సర్వే నంబర్ 182/1లో 88 సెంట్ల భూమి ఉంది. నా ప్రమేయం లేకుండా కొంతమంది పంచాయతీ తీర్మానం చేయించి రాస్ సేవా సమితికి అప్పగించేశారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక కింద కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చా. ఎలాంటి స్పందన లేదు. ఇప్పటి వరకు 9 పర్యాయాలు వినతులు సమర్పించా. సమస్య పరిష్కరించినట్లు మాత్రం మెసేజ్ వచ్చింది. అయితే నా భూమి మాత్రం దక్కలేదు. ఇంకా ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరగాలో తెలియడం లేదు.

– ప్రకాష్, పాపానాయుడుపేట, ఏర్పేడు మండలం

న్యాయం చేసేలా లేరు



మా కాలనీలోని బడిని మన్నవరం గ్రామానికి మార్చారు. మా పిల్లలను అంతదూరం పంపలేని పరిస్థితి. దీంతో పాఠశాలను మార్చవద్దని సచివాలయం నుంచి ఎంఈఓ కార్యాలయం వరకు అర్జీలు పెట్టుకున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. చివరకు జూన్ 30వ తేదీన కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చా. మా అర్జీ నంబర్ టీపీటీ 202506307561 .ఇప్పటికి 90 రోజులు గడిచింది. ఆ తర్వాత రెండు సార్లు వచ్చి మళ్లీ అర్జీలు ఇచ్చాం . అతీగతీ లేదు. ఇక్కడ కూడా న్యాయం చేసేలా లేరు.

– పెంచలమ్మ, రాగిగుంట ఎస్సీ కాలనీ, శ్రీకాళహస్తి మండలం

పట్టించుకునేవారే లేరు



మేం దివ్యాంగులం. నాకు పుట్టుకతో ఓ కాలు లేదు. నా భార్య సుప్రియ చేతికి వేళ్లులేదు. నా తండ్రి ఒక్కసారి ట్యాక్స్ కట్టాడని మా రేషన్ కార్డును 10 నెలల క్రితం రద్దు చేశారు. పింఛన్ కూడా తొలగించారు. దీంతో మేం వేరుగా రేషన్ కార్డు, పింఛన్ కోసం 9 నెలల క్రితం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. తర్వాత 6 నెలలుగా కలెక్టరేట్‌లో 8 పర్యాయాలు అర్జీలు ఇచ్చాం. ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. చిన్నబిడ్డతో కలెక్టరేట్ చుట్టూ తిరిగేందుకు తిప్పలు పడుతున్నాం. మాకు పూట గడవడమే కష్టంగా ఉంది. మా ఇబ్బంది చూసి కూడా పట్టించుకునేవారే లేరు.

– కె.వెంకటేష్, సుప్రియ, పూలశెట్టిగారిపల్లె, పాకాల మండలం

ఇది ఐదోసారి



కలెక్టరేట్‌కు వరుసగా ఇప్పటి వరకు ఐదు సోమవారాలు వచ్చాం. అర్జీలు ఇచ్చిపోతున్నాం. మాకు ఇంటి స్థలం ఇప్పించాలని వినతులు సమర్పిస్తున్నాం. అర్జీలు అయితే తీసుకుంటున్నారు. సమస్యకు మాత్రం పరిష్కారం చూపడం లేదు. అత్యంత పేద కుటుంబానికి చెందినవాళ్లం. రెక్కాడితేగానీ డొక్కనిండని బతుకులు, ఇంటి అద్దెలు భరించలేని దుస్థితి. ఆరోగ్యం సక్రమంగా ఉండదు. దీంతో తిరగలేకపోతున్నాం. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– కె.నాగమణి, దేశయ్య, బొమ్మగుంట, తిరుపతి

శెట్టిపల్లె భూ సమస్యపై పోరాటానికి సిద్ధం



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయరెడ్డి

తిరుపతి కల్చరల్ : శెట్టిపల్లె భూ సమస్య పరిష్కారానికి కమ్యూనిస్టులతో కలిసి పోరాడేందుకు సిద్ధమని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వేమన విజ్ఞాన కేంద్రంలో శెట్టిపల్లె భూ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అభినయ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇప్పటికే సమస్య పరిష్కారానికి జీఓ జారీ చేశారన్నారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ కూడా జారీ కావడంతో రైతులు, ప్లాటు యజమానులు తమ హక్కులను క్లెయిమ్ చేసుకునే అవకాశం వచ్చిందని వివరించారు. ఇందులో మిగులు భూమిని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించాలని సూచించారు. బాధిత రైతుల విభాగం నేత బత్తినబాబు, ప్లాట్ల బాధిత విభాగం నేత రాధాకృష్ణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి తమ భూమిని దక్కించుకునేందుకు యత్నిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబును ఐదు సార్లు కలిసి తమ గోడు విన్నవించామని, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అనేక సార్లు బాధను చెప్పుకునేందుకు యత్నిస్తే చీదరించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి అనేక సార్లు సమస్యను తీసుకెళ్లినా కాలయాపన చేయడం తప్ప చేసింది శూన్యమని వాపోయారు. ఇప్పటికే అనేక మంది బాధితులు కన్నుమూశారని తెలిపారు. కూటమి పాలనలో న్యాయం జరుగుతుందనే ఆశ లేదని, కనీసం ప్రతిపక్షాలైనా తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వామపక్ష నేతలు వందవాసి నాగరాజు, పెంచలయ్య, ఆర్.హరికృష్ణ, పి.అంజయ్య మాట్లాడుతూ సుమారు 250 మంది రైతులు, 3 వేల మంది ప్లాట్ల యజమానులు ఇబ్బందిపడుతున్నారని వెల్లడించారు. పోరాటంతోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. అనంతరం అఖిలపక్ష నేతలు పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు మల్లం రవిచంద్రారెడ్డి , ఆర్.వెంకటేశ్వర్లు, వాసు యాదవ్, రాజా, నాగిరెడ్డి ,పసుపులేటి సురేష్, ఇమ్రాన్ భాషా, దినేస్ ,యోగానందరెడ్డి, డీఎంసీ భాస్కర్, సీపీఐ నేత రాధాకృష్ణ, సీపీఎం నేత సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తీర్మానాలు ఇవే..

పోరాటంలో భాగంగా ఈనెల 2న కలెక్టర్‌కు సామూహిక వినతి పత్రం సమర్పించనున్నారు. 4న కేబినెట్‌లో చర్చ లేకుంటే ఈనెల 6న కరపత్రాల పంపిణీ. 8 నుంచి 14వ తేదీ వరకు తుడా కార్యాలయం వద్ద నిరసన దీక్షలు. 15,16 తేదీల్లో 48 గంటల పాటు నిరవధిక దీక్షలు. అప్పటికీ స్పందించకపోతే ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు.

క్వారీకి అనుమతులు ఇవ్వొద్దని వినతి

తొట్టంబేడు : తొట్టంబేడు సమీపంలో ఎంఎస్ఆర్ క్రషర్స్ వారి క్వారీకి అనుమతులు మంజూరు చేయవద్దని స్థానికులు కోరారు. సోమవారం బీడీకాలనీ, జగనన్న కాలనీ, న్యూసన్‌రైజ్ సిటీ లేఅవుట్‌లోని 75 ప్లాట్ల యజమానులు ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం తమ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, తాగునీటి శుద్ధి కేంద్రం, కొత్తగా నిర్మి స్తున్న గిరిజన సంక్షేమ వసతిగృహం ఉన్నాయన్నారు. పదేళ్ల క్రితం క్వారీ మూతపడిందని, ఇప్పుడు మళ్లీ క్రషర్స్ నిర్వాహకులు ఎన్ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆందోళ న వ్యక్తం చేశారు. అయితే ఎన్‌ఓసీని జారీ చేయవద్దని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

క్లుప్తంగా

94.56 శాతం పింఛన్ల పంపిణీ



సూళ్లూరుపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లావ్యాప్తంగా సోమవారం 94.56 శాతం మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. మిగిలిన వారికి మంగళవారం అందించనున్నారు.

సంతాన సాఫల్య కేంద్రాలపై నిఘా

తిరుపతి తుడా: జిల్లాలోని సంతాన సాఫల్య కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందకుండా సంతాన సాఫల్య కేంద్రం నిర్వహణ సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా కేవలం 11 సెంటర్లు మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. కొన్ని ఆస్పత్రులు ఐవీఎఫ్ సేవల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు తనిఖీలు చేపట్టామని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 4 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక్క కంపార్ట్‌మెంట్ మాత్రమే నిండింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,310 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,866 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.49 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 4 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

చిచ్చు పెట్టిన నిమజ్జనం



దళితవాడపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్



టీడీపీ నేత మునిశేఖర్‌ను నిలదీస్తున్న బాధితులు

- దళితులపై టీడీపీ నేతల దాడి

తిరుపతి రూరల్ : వినాయక నిమజ్జనం దుర్గసముద్రం గ్రామంలో చిచ్చు పెట్టింది. గణపతి విగ్రహంతో వచ్చారని దళితులపై టీడీపీ స్థానిక నేతలు సోమవారం ఉదయం గొడవకు దిగారు. అక్కడితో ఆగకుండా దళితుల ఇళ్లలోకి దూరి విచక్షణారహితంగా కొట్టారు. మహిళలు, పిల్లలనే తేడా లేకుండా బండరాళ్లు విసురుతూ భయానక వాతావరణం సృష్టించారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ చిన్నగోవిందు హుటాహుటిన గ్రామానికి వెళ్లి పచ్చమూకను చెదరగొట్టారు.

పోలీస్ పికెటింగ్

దళితవాడలో ఘర్షణల నేపథ్యంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ విచారణ చేపట్టారు. బాధితుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేసుకున్నారు. అలాగే ఘర్షణలకు పాల్పడిన వారి పేర్లను నమోదు చేసుకుని త్వరలో అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు.

గాయపడిన దళితులను ఆస్పత్రికి తరలించారు.

బాధితుల ఆగ్రహం

ఘటనాస్థలానికి వచ్చిన టీడీపీ నేత మునిశేఖర్‌ను దళితులు నిలదీశారు. ఇదేనా టీడీపీ ప్రభుత్వంలో మీరు చేస్తున్న మంచి అంటూ మండిపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

పోలీసుల అదుపులో నిందితులు

దళితవాడపై జరిగిన దాడిలో ప్రధాన కారకులైన ఒంటిల గణేష్, మాకా హరీష్, మాకా మహేష్, విజయ్, భరత్, శ్రీకాంత్, గాజుల రవి ప్రకాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వీరితో పాటు తిరుపతి నగరం నుంచి దాడిలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే తమకు సమాచారం అందించాలని దళితవాడ వాసులకు సూచించారు.



బాధితులను విచారణ చేస్తున్న డీఎస్పీ ప్రసాద్



వివరాలు తెలుసుకుంటున్న సీఐ చిన్న గోవిందు

టోల్ తీస్తున్నారు!

- మేర్లపాక టోల్ గేట్ సిబ్బంది దౌర్జన్యం
- నెలవారీ పాసులు ఇవ్వకుండా దోపిడీ



మేర్లపాక సమీపంలోని టోల్ గేట్

ఏర్పేడు : నాయుడుపేట జాతీయ రహదారిలోని మేర్లపాక టోల్ గేట్ వద్ద సిబ్బంది నయా దందాకు తెరతీశారు. వాహనదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. మేర్లపాక సమీపంలో మే 30వ తేదీన టోల్ గేటును ప్రారంభించారు. గేటు నిర్వహించే కర్నూలుకు చెందిన శ్రీ సాయి ఏజెన్సీ వారు 20 కిలోమీటర్ల పరిధిలోని స్థానికుల వాహనాలకు నెలకు రూ.350లతో టోల్ పాసులను అందించేవారు. అయితే ప్రస్తుతం టోల్ గేటు రుసుం వసూలు చేసే బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన ఇంద్రదీప్ ఇండియా లిమిటెడ్ చేపట్టింది. దీంతో స్థానికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలో సోమవారం నెలవారీ పాసుల కోసం వాహనదారులు బారులు తీరారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆందోళన చేపట్టారు. దీంతో టోల్ గేట్ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వాహనదారుల నుంచి కూడా రూ.201 చొప్పున ముక్కు పిండి వసూలు చేశారు. అధికారులు స్పందించి నెలవారీ పాసులు మంజూరు చేయాలని స్థానిక వాహనదారులు కోరుతున్నారు.

ప్రపంచానికి ఆదిగురువు భారత్

– మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న వెంకయ్యనాయుడు, తదితరులు

పెళ్లకూరు: సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన భారతదేశం ఒకప్పుడు ప్రపంచానికి ఆదిగురువు అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. పెళ్లకూరులోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు మన దేశంలో నలంద, తక్షశిల తదితర ప్రాంతాల్లో ఉన్న విశ్వవిద్యాలయాల్లో విదేశీయులు విద్యనభ్యసించారని గుర్తుచేశారు. ప్రపంచానికి మేధస్సును అందించిన మన సంప్రదాయాలను అందరూ పాటించాలన్నారు. లలితమ్మ విద్యావికాస్ ఉపకార వేతనం కింద ఇంటర్మీడియెట్ నుంచి బీటెక్ వరకు చదువుతున్న 58 మంది పేద విద్యార్థులకు రూ.25 వేల చొప్పున, 20 మందికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ16.50 లక్షలను ట్రస్టీ చాగణం గౌరీశంకర్ సొంత నిధుల నుంచి వెంకయ్యనాయుడు చెక్కులు పంపిణీ చేశారు. లలితమ్మ జిమ్, పార్క్‌ను ప్రారంభించారు. స్వర్ణ భారత్ ట్రస్టీ దీపా వెంకట్, ఉష, ఎమ్మెల్యే విజయశ్రీ, ట్రస్ట్ ప్రెసిడెంట్ చాగణం వరలక్ష్మి, సీఈవో పెనుబల్లి సీతారామయ్య, ట్రస్ట్ ప్రతినిధులు రాయసం హృషీకేశవ్, శ్రీలక్ష్మి, ఏవో కృష్ణ గల్లా, శ్రీవిన్య పాల్గొన్నారు

సర్వర్ పని చేయక పింఛను లబ్ధిదారుల ఇక్కట్లు

- గుంపులు గుంపులుగా ఒకే చోట పడిగాపులు



గూడూరు పట్టణంలోని వాములు మిట్ట వద్ద పింఛను కోసం సిబ్బందిని చుట్టు ముట్టిన లబ్ధిదారులు

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో సచివాలయ, మండల పరిషత్ సిబ్బంది సోమవారం పింఛను పంపిణీ కోసం ఆయా గ్రామాలకు వెళ్లారు. ఉదయం 11 గంటల వరకు సర్వర్ పనిచేయక పోవడంతో లబ్ధిదారులు ఎక్కడికక్కడ గుంపులు గుంపులుగా కూర్చుని పడిగాపులు పడాల్సి వచ్చింది. ఒక లబ్ధిదారునికి పింఛను ఇచ్చేందుకు 45 నిమిషాలు పట్టడంతో మిగిలిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గూడూరులోని కోనేటి మిట్ట, వాముల మిట్టలలోని లబ్ధిదారులు ఒక చోటకు రావడంతో సచివాలయ సిబ్బందిని చుట్టు ముట్టి పింఛను తొందరగా పంపిణీ చేయాలని వేడుకోవడం కనిపించింది.

వ్యవసాయం.. అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న వీసీ జయలక్ష్మీదేవి

చంద్రగిరి : వ్యవసాయ రంగం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జయలక్ష్మీదేవి స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు బ్లాక్‌లను ప్రారంభించారు. అనంతరం స్వర్ణముఖి అతిథి గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులకు మంచి చేస్తూ, సాగును సంబరంగా మార్చేందుకే ఎన్‌జీ రంగా వర్సిటీ ఏర్పాటైందన్నారు. అందులో భాగంగా వివిధ పరిశోధనలు చేపట్టినట్లు, కొత్త ప్రాజెక్టులను అమలులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే వ్యవసాయ కళాశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్, డీన్ ఆఫ్ అగ్రి ఇంజినీరింగ్, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్, డీన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ వంటి కీలక పదవులను నియమించినట్లు వివరించారు. వర్సిటీ నెలకొల్పి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాపట్ల, తిరుపతి వ్యవసాయ కళాశాలల్లో బాలికల వసతి గృహాల నిర్మాణానికి రూ. 3 కోట్ల చొప్పున విడుదల చేసినట్లు వెల్లడించారు.

సముద్రపు నాచుతో జీవనోపాధి



బోట్‌లో వెళుతున్న గ్లోబల్ బృందం

వాకాడు : సముద్రపు నాచు మొక్కల పెంపకంతో మత్స్యకారులు ప్రత్యామ్నాయ జీవనోపాధి పొందవచ్చని గ్లోబల్ క్లైమెట్ ఫండ్ టీమ్ లీడర్ రఫీ తెలిపారు. సోమవారం ఈ మేరకు వాకాడు మండలం కొండూరుపాళెం, అంజలాపురం బీచ్‌లను సందర్శించారు. సముద్ర నాచు మొక్కల పెంపకానికి అనుకూల ప్రాంతాలుగా గుర్తించారు. సముద్రపు అంతర్భాగంలో నాచు వృద్ధి చెందితే వివిధ జీవరాశులకు ఆవాసంగా మారుతుందని, భూమి వేడెక్కకుండా నివారించి ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుతుందని వివరించారు. సముద్ర నాచు పెంపకం కింద 50 యూనిట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ పథకానికి మహిళా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

పరిశీలించి.. పరిష్కారం

- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన అర్జీదారులు
- వివిధ సమస్యలపై 195 వినతులు



సమస్య తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు జేసీతోపాటు ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్సీ, డీఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్ మాండ్, సుధారాణి హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 195 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే విభిన్న ప్రతిభావంతురాలైన ఎస్పీ షాజహాన్‌కు రూ.12వేల విలువైన ట్రైసైకిల్‌ను జేసీ శుభం బన్సల్ అందించారు.

సీఎం పేరు చెప్పి కబ్జాలు

సీఎం చంద్రబాబుకు బంధువంటూ పవన్ అనే వ్యక్తి ఇష్టారాజ్యంగా భూములను కబ్జా చేస్తున్నారని సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మండిపడ్డారు. మఠం, తిరుపతి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని భూములు, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సైతం ఆక్రమించుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

పొదుపు మహిళల ఆవేదన



పొదుపు డబ్బులను మెప్మాలోని కొందరు రిసోర్స్ పర్సన్‌లు ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారంటూ డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని సంజీవ్‌గాంధీ కాలనీకి చెందిన ఆర్‌పీ నాహీరా రూ.70 లక్షలు పొదుపు నగదును స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తమకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు మొరపెట్టుకున్నారు.

పింఛన్ కోసం



నేను దివ్యాంగురాలిని. గతంలో నాకు వైకల్యం 88శాతంగా నమోదు చేశారు. రీవెరిఫికేషన్‌లో 85శాతం చేశారు. అలాగే నా కుమారుడు దేదీప్ కూడా దివ్యాంగుడు. గతంలో 100శాతం వైకల్యం ఇచ్చారు. రీవెరిఫికేషన్‌లో 90శాతంగా తగ్గించారు. మేము రూ.15వేల పింఛన్‌కు అర్హులం. అయితే మాకు రూ.6వేలే వస్తున్నాయి. మాకు న్యాయం చేయండి.

– లక్ష్మిప్రియ, దేదీప్, తిమ్మినాయుడుపాళెం, తిరుపతి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతదేహం పరిశీలిస్తున్న ఎస్ఐ

కోట: మండలంలోని తిమ్మనాయుడుపాళెంలో సోమవారం విద్యుదాఘాతంతో వరికోత మిషన్ ఆపరేటర్ మృతి చెందాడు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా గుడుగులదిన్నె గ్రామానికి చెందిన రవి(23) వరికోత మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తిమ్మనాయుడుపాళెం వద్ద పంట కోసేందుకు వెళుతుండగా మిషన్‌కు విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదం జరిగింది. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేయర్‌కు తప్పిన ప్రమాదం



సర్వేయర్ గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహించే భవనం పెచ్చులూడుతోంది. సోమవారం ఓ గదిలో పెచ్చులూడి పడడంతో సర్వేయర్ కుర్చీ విరిగిపోయింది. ఆ సమయంలో ఆయన లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి అక్కడకు చేరుకుని సర్వేయర్ గదిని పరిశీలించారు. ఆ గదికి తాళం వేసేసి మరోచోట కూర్చోవాలని సర్వేయర్‌ను ఆదేశించారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం కేసులో తమిళనాడుకు చెందిన కె.అన్బుకు ఐదేళ్ల జైలు, రూ.6లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కేసుల న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. 2016 డిసెంబర్ 8వ తేదీ శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ ఉద్యోగి మృతి



మునీంద్రబాబు మృతదేహం

ఏర్పేడు : మండలంలోని వికృతమాల వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మడిబాక పంచాయతీ రాజుల కండ్రికకు చెందిన పి.మునీంద్ర బాబు (59) మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు.. టీటీడీలో పనిచేస్తున్న మునీంద్రబాబు ద్విచక్రవాహనంపై వెళుతుండగా పంది అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ శుక్రవారములలో

WANTED

ప్రభుత్వ సంస్థలలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్‌గా పనిచేయుటకు ఆసక్తిగల పురుషులు కావలయును. ఆకర్షణీయమైన జీతం కలదు. సూపర్‌వైజర్స్ - Qua - Degree, సెక్యూరిటీ గార్డ్స్ - Qua - 10th Class పైన

ph: 98497 71345, 91608 98889

WALK-IN-INTERVIEWS
(TIRUPATI & CHITTOOR)

Balaji Agencies & Industries Authorized
MAHINDRA & MAHINDRA

- CRM & ICRE :- 2 FEMALE
- TD MARSHAL :- 1 MALE
- SALES EXECUTIVES :- 6 (PV, CV & LMM)
- FQC :- 2
- HOSTESS :- 2 FEMALE
- SERVICES ADVISOR :- 4
- TECHNICIAN :- 4
  Qualifications: ITI, DEGREE & MBA
- EX-MART MANAGER :- 1 MALE

Interviews Dates: 05-09-2025 and 06-09-2025

BALAJI AGENCIES & INDUSTRIES
Sy.No. 192/3B/1C, 2C & 3C, Renigunta-Chittoor By Pass Road, Kotramangalam (V), Renigunta(M), Tirupati-Chittoor Dist.,
Contact: 92909 99235, 92909 99348, email: hrbalajitirupati@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

- తిరుపతిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేయుటకు Junior Accountant, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్ కావలెను. సంప్ర: 9741163131, 9676329827.
- ఓం సువదం హాస్పిటల్, తిరుపతి లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్,హౌస్ కీపింగ్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 77027 00244.
- Urgent Hiring Looking for Domestic IT Recruiters, Any Graduates with good communication skills are preffered, Freshers also can apply. 8712345519.
- గూడూరు (రాపోయే) జిల్లా పరిసరాల్లో అంకణం 35K నుండి 1.5 L వరకు గల ప్లాట్స్‌ను మార్కెటింగ్ చేయుటకు రియల్ ఎస్టేట్ ఏజంట్స్, ప్రభుత్వ / ప్రైవేట్ ఉపాధ్యాయులు, గృహిణులు, నెట్‌వర్క్ మార్కెటింగ్ నాయకుల మార్కెటింగ్ బృందం కావలెను. సంప్ర :: 78708 90977.
- తిరుపతి,చిత్తూరు జిల్లాల్లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. మిల్క్ టాంకర్ లోడర్స్-SSC/Inter ఫీల్డ్‌సూపర్‌వైజర్స్-Any Graduation, ఫీల్డ్‌కెమిస్ట్-B.Sc Chemistry/Dairy Science/BioTechnology/Microbiology/FoodScience,మిల్క్‌చిల్లింగ్ సెంటర్ అసిస్టెంట్& ఇన్‌చార్జులు-Anyడిగ్రీ.Email :career@shreejamilk.com, 9154282113.
- కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ. 15వేలు-40వేలు.ఫ్రీరూమ్+భోజనం.Hyd. 7993583999

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించవలసిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాలుగులైన్ల ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు ఛాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250. మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

Union Bank of India | **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి,
యస్.వి.యూనివర్శిటీ, తిరుపతి-517502, ఫోన్ నెం. : 93218 23026

స్వాధీనత ప్రకటన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1) ప్రకారం నోటీసు (స్థిరాస్తుల కొరకు)

దిగువ సంతకందారుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు అధీకృత అధికారి వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్, 2002 (యాక్ట్ 2002 యొక్క 54) మరియు 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల 2002 లోని నిబంధన 3తో చదువుకొనేలా యాక్ట్‌లోని సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని దిగువ పేర్కొన్న ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలకు నోటీసులో పేర్కొన్న, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు ఒప్పందం(ల) ప్రకారం దిగువ పేర్కొన్న మొత్తాన్ని మరియు తదుపరి వడ్డీని తిరిగి చెల్లించమని కోరుతూ ఈ దిగువ తెలిపిన తేదీన **డిమాండ్ నోటీసు** ఇవ్వడమైనది.

ఋణగ్రహీతలు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందు క్రింద వివరించిన ఆస్తిని సదరు నిబంధనలలోని నిబంధన 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని ఈ దిగువ తెలిపిన తేదీన ఆ క్రింది సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

సదరు ఆస్తితో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు ఆస్తులతో వ్యవహారం చేసినచో ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలు చెల్లించాల్సిన బకాయి మొత్తం మరియు దానిపై గల వడ్డీ మొత్తాలకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జికి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీతలకు మరియు ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతకై సదరు చట్టంలోని సెక్షన్ 13(8) లోని నిబంధనలు గమనించగలరు.

ఖాదీ కాలనీ బ్రాంచ్ (25711), తిరుపతి, కెన్స్ గ్రాండ్ రెసిడెన్సీ, రామచంద్రానగర్, తిరుపతి-517507

1) ఋణగ్రహీతలు : గాజుల యశశ్విని, భర్త : ఆర్.బాలాజీ మరియు శ్రీ ఆర్.బాలాజీ, తండ్రి : ఆర్.వెంకట స్వామి
డిమాండ్ నోటీసు తేది: 04.06.2025, (బకాయి: తేది.31-05-2025 నాటికి రూ.39,40,167.62 పై మరియు తదుపరి వడ్డీ & ఖర్చులు)
స్వాధీనం తీసుకున్న తేది: 29.08.2025, (బకాయి : తేది.30-06-2025 నాటికి రూ.39,68,764.42 పై మరియు తదుపరి వడ్డీ & ఛార్జీలు)
స్థిరాస్తి వివరములు : తిరుపతి జిల్లా, తిరుపతి సబ్-జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, ఉపాధ్యాయ నగర్ దగ్గర, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర నగర్ లే అవుట్, నెం.9 అక్కారంపల్లి గ్రామ ఖాతాలు, క్రొత్త టి.యస్.నెం.11/2బి/2ఎ7, ప్లాటు నెం.82, డి.నెం.22-8-100/501గా గల 3180 చ.అ.ల విస్తీర్ణం రెసిడెన్షియల్ భూమి నందు అపార్ట్‌మెంట్ మరియు 1310 చ.అ.ల ప్లాటు సూపర్ బిల్టప్ ఏరియా కలిగి, 35.33 చ.గ.లు అవిభాజ్యపు వాటాతో గల వస్త్ర కవచ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ నందు 5వ అంతస్తులోని ప్లాటు నెం.501 యావదాస్తి గాజుల యశశ్విని గారికి చెందినది.
అపార్ట్‌మెంట్ హద్దులు : తూర్పు : సర్వే నెం.11/2బి2 లోని ఇతరులకు చెందిన భూమి, పడమర : 40 అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం : ఐయ్యాల భాస్కర్ గారికి చెందిన ప్లాటు నెం.81, దక్షిణం : టి.మనోరమ గారికి చెందిన ప్లాటు నెం.83.
ప్లాట్ హద్దులు : తూర్పు : కారిడార్ మరియు ప్లాటు నెం.502, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై

శ్రీకాళహస్తి బ్రాంచ్ (05141), జయరామారావు వీధి, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా-517644

2) ఋణగ్రహీతలు: గెద్దం చిన్న అంకిరెడ్డి, తండ్రి : గెద్దం గున్నారెడ్డి మరియు శ్రీమతి గెద్దం ఇంద్రాణి, భర్త : శ్రీ గెద్దం చిన్న అంకిరెడ్డి
డిమాండ్ నోటీసు తేది: 16.06.2025, (బకాయి : తేది.02-06-2025 నాటికి రూ.4,74,721.48 పై మరియు తదుపరి వడ్డీ మరియు & ఖర్చులు).
స్వాధీనం తీసుకున్న తేది: 30.08.2025, (బకాయి : తేది.19-07-2025 నాటికి రూ.4,66,819.48 పై మరియు తదుపరి వడ్డీ & ఛార్జీలు).
స్థిరాస్తి వివరములు: తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, ఆర్‌టిసి బస్టాండు దగ్గర, పివి రోడ్డు, యానాది సెంటర్, న్యూ వార్డు నెం.7, న్యూ అసెస్‌మెంట్ నెం.1011011245, సర్వే నెం.246/3 లోని డి.నెం.7-32 (పాత డి.నెం.17బి)తో ఎ.1.18 సెంట్లులోని 600 చ.అ.లు లేదా 66.66 చ.గ.లు విస్తీర్ణం గల రెసిడెన్షియల్ భూమి మరియు భవనము శ్రీమతి గెద్దం ఇంద్రాణమ్మ అలియాస్ గెద్దం ఇంద్రాణి గారికి చెందిన యావదాస్తి.
హద్దులు : తూర్పు : నూతనంగా నిర్మించిన భవనము, పడమర : రఫీ గారి భూమి మరియు ఇల్లు, ఉత్తరం : ఇతరుల ఇల్లు, దక్షిణం : యానాది వీధి / 6 అడుగులు వెడల్పు సిమెంట్ రోడ్డు.
ఈ పై హద్దుల మధ్య గల కొలతలు : తూర్పు నుండి పడమర - 24 అ.లు లేదా 7.32 మీ.లు, ఉత్తరం నుండి దక్షిణం-25 అ.లు లేదా 7.62 మీ.లు.

తేది : 01-09-2025, ప్రదేశం : తిరుపతి | సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా